తుఫాన్‌లో టీమ్‌ఇండియా

బార్బడోస్‌లో చిక్కుకున్న భారత క్రికెట్ జట్టు ● వర్షం, ఈదురుగాలులతో ప్రయాణానికి ఇబ్బంది ● హోటల్‌కే పరిమితమైన ప్లేయర్లు

బ్రిడ్జ్‌టౌన్(బార్బడోస్): భారత క్రికెట్ జట్టు బార్బడోస్ తుఫాన్‌లో చిక్కుకుంది. భారతీయుల సుదీర్ఘ కలను సాకారం చేసి స్వదేశంలో సగర్వంగా అడుగుపెడుదామనుకున్న టీమ్‌ఇండియాకు ఇబ్బందులు చుట్టుముట్టాయి. బెరిల్ తుఫాన్‌తో బార్బడోస్ తీర ప్రాంతం చిగురుటాకులా వణుకుతున్నది. సముద్రతీర ప్రాంతం కావడంతో పాటు బలమైన గాలులకు తోడు భారీ వర్షంతో బార్బడోస్ నగరం తడిసి ముద్దయ్యింది. టైప్-4 తుఫాన్‌గా భావిస్తున్న బెరిల్ గంటకు దాదాపు 209 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీస్తున్నాయి. దీంతో నగరం మొత్తం అధికారులు కర్ఫ్యూ విధించారు. భీకరమైన గాలులు వీస్తున్న నేపథ్యంలో బయటికి ఎవరూ రావద్దంటూ హెచ్చరికలు జారీ చేశారు. దీనికి తోడు స్థానిక విమానాశ్రయం తుఫాన్‌తో జలమయమైంది. విమానాలు ప్రయాణం చేసేందుకు అనువైన వాతావరణం లేకపోవడంతో ఎయిర్‌పోర్ట్‌ను తాత్కాలికంగా మూసివేశారు. ఈ కారణంగా ప్రస్తుతం హిల్టన్ హోటల్‌లో బస చేస్తున్న భారత క్రికెటర్లతో పాటు వారి కుటుంబ సభ్యులు, సహాయక సిబ్బంది, బీసీసీఐ అధికారులు హోటల్ గదులకు పరిమితమయ్యారు. సోమవారం తుఫాన్ తీరం చేరే అవకాశమున్న నేపథ్యంలో మంగళవారం తుఫాన్ ప్రభావం తగ్గే అవకాశాలు కనిపిస్తున్నట్లు తెలిసింది. భారీ తుఫాన్ కారణంగా హోటల్ సిబ్బంది లేకపోవడంతో క్రికెటర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనికి తోడు కరెంట్ కూడా తీసేసినట్లు వార్తలు వస్తున్నాయి. ప్రస్తుతమే అక్కడే ఉన్న బీసీసీఐ కార్యదర్శి జై షా ఎక్స్‌లో స్పందిస్తూ 'బార్బడోస్‌లో చిక్కుకుపోయాం. తుఫాన్ సద్దుమణిగిన తర్వాత స్వదేశంలో ప్లేయర్ల సన్మానం గురించి ఆలోచిస్తాం' అని అన్నాడు.

70 మందితో చార్టెడ్ విమానంలో!

వాస్తవానికి ఆదివారమే న్యూయార్క్‌కు బయల్దేరాల్సి ఉన్నా..తుఫాన్ కారణంగా బార్బడోస్‌లోనే ఉండిపోయారు. ఉదయం సమయాన దక్షిణాఫ్రికా టీమ్..బార్బడోస్ నుంచి తిరుగు ప్రయాణమైంది. ఇదిలా ఉంటే ప్రస్తుతం టీమ్ ఇండియా క్రికెటర్లు, వారి కుటుంబ సభ్యులు, సహాయక సిబ్బంది, బీసీసీఐ ప్రతినిధి బృందం, స్పోర్ట్స్ జర్నలిస్టులు అంతా కలిపి 70 మంది వరకు ఉన్నట్లు అంచనా. వీరందరూ కలిసి చార్టెడ్ విమానంలో స్వదేశానికి వెళ్లేందుకు బోర్డు ప్రయత్నాలు చేస్తున్నది. ఎయిర్‌పోర్ట్ నుంచి క్లియరెన్స్ రాగానే ప్రయాణమయ్యేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు బోర్డు వర్గాలు పేర్కొన్నాయి. మొత్తంగా భారత క్రికెట్ జట్టు..క్షేమంగా చేరుకోవాలని అభిమానులు ఆకాంక్షిస్తున్నారు.

కోట్లాది మంది భారతీయుల కలలు సాకారమైన వేళ..ప్రతిష్ఠాత్మక టీ20 ప్రపంచకప్ ట్రోఫీతో కెప్టెన్ రోహిత్‌శర్మ ఇలా తీవిగా ఫోజిచ్చాడు. ఈ ఫొటోను బీసీసీఐ సోమవారం ఎక్స్‌లో పోస్ట్ చేసింది.

యూటీటీ వేలంలో శ్రీజ

న్యూఢిల్లీ: అల్టిమేట్ టేబుల్ టెన్నిస్ (యూటీటీ)-2024 ప్లేయర్ల వేలంలో భారత యువ ప్యాడ్లర్ ఆకుల శ్రీజ తన అదృష్టాన్ని పరీక్షించుకోనుంది. అంతర్జాతీయ స్థాయి టోర్నీల్లో అద్భుత ప్రదర్శన కనబరుస్తున్న శ్రీజను దక్కించుకునేందుకు ఫ్రాంచైజీలు పోటీపడే అవకాశముంది. ముంబైలో ఈ నెల10న జరిగే ప్లేయర్ల డ్రాఫ్ట్‌లో శ్రీజతో పాటు బెర్నాడెట్ స్టోక్స్ (రొమేనియా), ఖాద్రీ (నైజీరియా), నినా మితెల్హం (జర్మనీ) అత్యధిక మొత్తాన్ని సొంతం చేసుకునే చాన్స్ కనిపిస్తున్నది. ప్రపంచ 24వ ర్యాంకర్ శ్రీజ భారత ప్లేయర్లలో ప్రధాన ఆకర్షణగా నిలువనుంది.

అమ్మాయిలు అదుర్స్

దక్షిణాఫ్రికాపై భారత్ ఘన విజయం ● ఏకైక టెస్టు మ్యాచ్ కైవసం ● స్నేహ్‌రానాకు పది వికెట్లు

అమ్మాయిలు అదరగొట్టారు. సొంతగడ్డపై తమకు తిరుగులేదని చాటిచెబుతూ సుదీర్ఘ ఫార్మాట్‌లో సత్తాచాటారు. దాదాపు దశాబ్దం తర్వాత దక్షిణాఫ్రికాతో జరిగిన ఏకైక టెస్టులో భారత మహిళల జట్టు విజయదుందుభి మోగించింది. భారీ స్కోర్లు, వికెట్ల వేట కొనసాగిన పోరులో సఫారీలపై టీమ్‌ఇండియాదే పైచేయి అయ్యింది. అటు బ్యాటింగ్‌తో పాటు బౌలింగ్‌లోనూ రాణించిన కౌర్‌సేన ఏకైక టెస్టు మ్యాచ్‌ను తమ ఖాతాలో వేసుకుంది. లారా వోల్వార్డ్, సునె లుస్ శతక పోరాటం చేసినా లాభం లేకపోయింది.

చెన్నై: టెస్టుల్లో భారత మహిళల క్రికెట్ జట్టు జైత్రయాత్ర కొనసాగుతున్నది. ఇప్పటికే ఇంగ్లండ్, ఆస్ట్రేలియాపై చారిత్రక విజయాలు సాధించిన టీమ్‌ఇండియా తాజాగా దక్షిణాఫ్రికా భరతం పట్టింది. సోమవారం ముగిసిన ఏకైక టెస్టులో భారత్ 10 వికెట్ల తేడాతో సఫారీలపై ఘన విజయం సాధించి సిరీస్ విజేతగా నిలిచింది. ఓవర్‌నైట్ స్కోరు 232/2 నాలుగో రోజు ఫాల్‌ఆన్‌కు దిగిన సఫారీలు..టీమ్‌ఇండియాకు దీటుగా బదులిచ్చే ప్రయత్నం చేశారు. పిచ్ పరిస్థితులను అనుకూలంగా మార్చుకుంటూ కెప్టెన్ లారా వోల్వార్డ్(122), సునె లుస్(109) సూపర్ సెంచరీతో రాణించారు. దీంతో రెండో ఇన్నింగ్స్‌లో దక్షిణాఫ్రికా 373 పరుగులు చేసి భారత్‌కు 37 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని నిర్దేశించింది. స్నేహ్‌రానా(2/111), దీప్తిశర్మ(2/95), రాజేశ్వరి(2/55) రెండేసి వికెట్లు తీశారు. ఓపెనర్లు షెఫాలీ వర్మ(24), శుభా సతీశ్(13) నాటౌట్‌గా నిలిచి జట్టును గెలిపించారు. రెండు ఇన్నింగ్స్‌లో కలిపి 10 వికెట్లు తీసిన స్నేహ్ రానాకు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

పోరాడిన వోల్వార్డ్, లుస్:

తొలి ఇన్నింగ్స్‌లో తడబడ్డ..దక్షిణాఫ్రికా ఫాలోఆన్‌లో భారత్‌కు దీటుగా సమాధానమిచ్చేందుకు ప్రయత్నించింది. ముఖ్యంగా వోల్వార్డ్, లుస్ సెంచరీలతో భారత బౌలర్లకు పరీక్ష పెట్టారు. పరిస్థితులను తమకు అనుకూలంగా మలుచుకుంటూ టీమ్‌ఇండియా బౌలర్లపై తమ పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శించారు. పిచ్ ఓవైపు స్పిన్నర్లకు సహకరిస్తున్నా..ఏ మాత్రం వెనుకకు తగ్గకుండా వోల్వార్డ్, లుస్ పరుగులు కొల్లగొట్టారు. 314 బంతులు ఎదుర్కొన్న వోల్వార్డ్ 16ఫోర్లతో విజృంభించగా, 203 బంతులు ఆడిన లుస్ 18 ఫోర్లు ఖాతాలో వేసుకుంది. వీరిద్దరు కలిసి రెండో వికెట్‌కు 190 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. లుస్‌ను కౌర్ ఔట్ చేయడం ద్వారా వీరి జోరుకు అడ్డుకట్ట వేసింది. డీకెర్(61) మిడిలార్డర్‌లో ఆకట్టుకోగా, మిగతా బ్యాటర్లు స్వల్ప స్కోర్లకు పరిమితమయ్యారు. మొత్తంగా భారత్‌పై రెండో ఇన్నింగ్స్‌లో దక్షిణాఫ్రికా రికార్డు స్కోరు నమోదు చేసింది.

స్నేహ్‌రానా (8/77, 2/111) షెఫాలీవర్మ (205, 24*)

సంక్షిప్త స్కోర్లు

భారత్ తొలి ఇన్నింగ్స్: 603డిక్లేర్డ్, దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్: 266 ఆలౌట్, రెండో ఇన్నింగ్స్: 373 ఆలౌట్, భారత్ రెండో ఇన్నింగ్స్: 37/0.

సింగపూర్‌లో చెస్ ప్రపంచ టోర్నీ

భారత్‌కు దక్కని ఆతిథ్యం

న్యూఢిల్లీ: చెస్ ప్రపంచ చాంపియన్‌షిప్ ఆతిథ్యం విషయంలో భారత్‌కు ఆశాభంగమైంది. ప్రతిష్ఠాత్మక టోర్నీ నిర్వహణ కోసం ఢిల్లీ, చెన్నై పోటీపడగా చివరికి సింగపూర్‌కు ఆ అవకాశం దక్కింది. ఈ విషయాన్ని అంతర్జాతీయ చెస్ సమాఖ్య(ఫిడే) సోమవారం ప్రకటనలో పేర్కొంది. మెగాటోర్నీకి ఆతిథ్యమిచ్చేందుకు అటు తమిళనాడు ప్రభుత్వం, ఢిల్లీ ప్రయత్నించినప్పటికీ నిరాశే ఎదురైంది. నవంబర్ 20 నుంచి డిసెంబర్ 15 మధ్యలో జరిగే చెస్ ప్రపంచ చాంపియన్‌షిప్‌లో భారత యువ గ్రాండ్‌మాస్టర్ దొమ్మరాజు గుకేశ్..చైనాకు చెందిన డిఫెండింగ్ చాంపియన్ డింగ్ లిరెన్‌తో ముఖాముఖి తలపడనున్నాడు. టోర్నీ చరిత్రలో పోటీపడబోతున్న పిన్న వయసు జీఎంగా గుకేశ్ కొత్త రికార్డు నెలకొల్పబోతున్నాడు. భారత్‌కు ఆతిథ్యం దక్కకపోవడంపై ఏఐసీఎఫ్ కార్యదర్శి దేవ్ ఏ పటేల్ నిరాశ వ్యక్తం చేశారు.

ఆర్‌సీబీ మెంటార్‌గా కార్తీక్

బెంగళూరు: భారత మాజీ క్రికెటర్ దినేశ్ కార్తీక్ కొత్త కెరీర్ మొదలుపెట్టబోతున్నాడు. ఇటీవలే తన అంతర్జాతీయ క్రికెట్ కెరీర్‌కు వీడ్కోలు పలికిన కార్తీక్..తాజాగా రాయల్‌చాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ) బ్యాటింగ్ కోచ్, మెంటార్‌గా ఎంపికయ్యాడు. ఈ విషయాన్ని ఆర్‌సీబీ సోమవారం తమ అధికారిక ఎక్స్(ట్విటర్) ద్వారా వెల్లడించింది. 'మా కీపర్‌కు అన్ని రకాలుగా స్వాగతం పలుకుతున్నాం. కార్తీక్ కొత్త రూపంలో ఆర్‌సీబీలోకి వస్తున్నాడు. బ్యాటింగ్ కోచ్‌తో పాటు మెంటార్‌గా డీకే వ్యవహరిస్తాడు' అని రాసుకొచ్చింది. జీవితంలో కొత్త కెరీర్‌ను మొదలుపెట్టబోతున్నందుకు చాలా ఆసక్తితో ఎదురుచూస్తున్నానని కార్తీక్ పేర్కొన్నాడు.

జింబాబ్వే టీ20 కెప్టెన్‌గా సికిందర్

హరారే: భారత్‌తో జరుగనున్న ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌కు జింబాబ్వే జట్టును సోమవారం ఎంపిక చేశారు. 17 మందితో కూడిన జట్టుకు సీనియర్ క్రికెటర్ సికిందర్ రజా కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. ఈ నెల 6 నుంచి భారత్, జింబాబ్వే మధ్య టీ20 సిరీస్ మొదలుకానుంది. పొట్టి ఫార్మాట్‌కు క్రెగ్ ఇర్విన్, సీన్ విలియమ్స్ లాంటి సీనియర్లను పక్కకు పెట్టిన జింబాబ్వే సెలెక్షన్ కమిటీ..జూనియర్లను జట్టులోకి తీసుకుంది. బెల్జియంకు చెందిన అంతమ్ నక్విని ఎంపిక చేసినా అతని పౌరసత్వంపై స్పష్టత రావాల్సి ఉంది.

ఐసీసీ టీ20 టీమ్‌లో ఆరుగురు

భారత్‌కు అగ్రభాగం, కోహ్లీకి దక్కని చోటు

దుబాయ్: ఐసీసీ టీ20 ప్రపంచకప్ జట్టులో చాంపియన్ టీమ్ భారత్ అగ్రభాగం దక్కించుకుంది. సమిష్టి ప్రదర్శనతో సత్తాచాటుతూ సుదీర్ఘ కలను సాకారం చేసుకున్న భారత్ జట్టు నుంచి ఏకంగా ఆరుగురు ప్లేయర్లు ఐసీసీ సోమవారం ప్రకటించిన వరల్డ్ లెవన్ టీమ్‌లో చోటు దక్కించుకున్నారు. ఇందులో కెప్టెన్ రోహిత్‌శర్మతో పాటు సూర్యకుమార్ యాదవ్, హార్దిక్‌పాండ్యా అక్షర్‌పటేల్, జస్ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్‌సింగ్ ఉన్నారు. తన దూకుడైన బ్యాటింగ్‌తో జట్టు విజయాల్లో కీలకమైన రోహిత్‌కు చోటు దక్కగా, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీకి స్థానం దక్కలేదు. మరోవైపు 4.17ఎకానమీ రేట్‌తో 15 వికెట్లు పడగొట్టి ప్లేయర్ ఆఫ్ ద సిరీస్‌గా నిలిచిన బుమ్రాతో పాటు అర్ష్‌దీప్‌సింగ్(17) చోటు దక్కించుకున్నారు. సెమీస్ చేరి సంచలనం సృష్టించిన అఫ్గన్ క్రికెటర్లు గుర్బాజ్, రషీద్ ఖాన్, ఫారుఖీతో పాటు ఆసీస్ నుంచి స్టాయినిస్, పూరన్(వెస్టిండీస్), నోకియా(12వ క్రికెటర్) టీమ్‌కు ఎంపికయ్యారు.

ఐసీసీ టీ20 టీమ్: రోహిత్, సూర్యకుమార్, హార్దిక్, అక్షర్, బుమ్రా, అర్ష్‌దీప్, గుర్బాజ్, రషీద్‌ఖాన్, ఫారుఖి, స్టాయినిస్, పూరన్, నోకియా(12వ క్రికెటర్)

500కోట్ల క్లబ్‌లో 'కల్కి'

బాక్సాఫీస్ బరిలో 'కల్కి' జైత్రయాత్ర కొనసాగుతున్నది. ప్రభాస్ కథానాయకుడిగా నాగ్‌అశ్విన్ దర్శకత్వంలో రూపొందిన ఈ సైన్స్ ఫిక్షన్ చిత్రానికి ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులు బ్రహ్మరథం పడుతున్నారు. నాలుగు రోజుల్లోనే ఈ సినిమా రికార్డు స్థాయిలో 555 కోట్ల గ్రాస్ వసూళ్లను రాబట్టింది. ఈ విషయాన్ని చిత్ర నిర్మాణ సంస్థ వైజయంతీ మూవీస్ అధికారికంగా ప్రకటించింది. హిందీ బెల్ట్‌లో ఈ చిత్రం నాలుగు రోజుల్లో 115 కోట్ల కలెక్షన్స్ సాధించడం విశేషం. ఇక విదేశాల్లో కూడా 'కల్కి' వసూళ్లపరంగా సంచలనాలను సృష్టిస్తున్నది. ఉత్తర అమెరికాలో తొలి వారాంతంలోనే 11 మిలియన్ డాలర్ల కలెక్షన్స్ (90.2 కోట్లు) రాబట్టిన మొదటి భారతీయ చిత్రంగా అరుదైన ఘనతను సొంతం చేసుకుంది. ప్రస్తుతం ఉన్న ట్రెండ్స్ ప్రకారం అతిత్వరలో ఈ సినిమా వెయ్యి కోట్ల క్లబ్‌లో చేరడం ఖాయమని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

దళపతితో వన్స్‌మోర్

చిత్రం

తమిళ సినీరంగంలో దళపతి విజయ్-సమంత జోడీని హిట్ పెయిర్‌గా అభివర్ణిస్తారు. వీరిద్దరూ కలిసి నటించిన మూడు చిత్రాలు బాక్సాఫీస్ వద్ద భారీ విజయాలను సాధించాయి. దీంతో ఈ జంట వెండితెరపై మరోమారు సందడి చేయాలని అభిమానులు కోరుకుంటున్నారు. ఈ నేపథ్యంలో విజయ్ 69వ చిత్రంలో సమంత కథానాయికగా ఖరారైందని తమిళ ఫిల్మ్ సర్క్యిల్స్‌లో ప్రచారం జరుగుతున్నది. దళపతి విజయ్ రాజకీయ అరంగేట్రానికి రంగం సిద్ధం చేసుకుంటున్నారు. తన చివరి చిత్రంగా 'విజయ్ 69'కు సన్నాహాలు చేస్తున్నారు. పొలిటికల్ థ్రిల్లర్‌గా తెరకెక్కనున్న ఈ చిత్రానికి హెచ్.వినోద్ దర్శకత్వం వహిస్తారు. డీవీవీ దానయ్య నిర్మాత. ఇందులో విజయ్ యువ రాజకీయ నాయకుడిగా కనిపిస్తారని అంటున్నారు. ఈ చిత్రంలో కథానాయికగా సమంత దాదాపుగా ఖరారైందని, త్వరలో అధికారిక ప్రకటన వెలువడుతుందని సమాచారం. ప్రస్తుతం సమంత స్వీయ నిర్మాణ సంస్థలో 'మా ఇంటి బంగారం' అనే చిత్రాన్ని తెరకెక్కిస్తున్నది.

శ్రీలంకలో పోరుకు సిద్ధం

విజయ్ దేవరకొండ కథానాయకుడిగా గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో ఓ పీరియాడిక్ డ్రామా తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మిస్తున్నారు. ఇందులో విజయ్ దేవరకొండ గూఢచారి పాత్రలో కనిపించనున్నారని సమాచారం. ఈ సినిమా ఇటీవల వైజాగ్‌లో 30 రోజుల షెడ్యూల్‌ను పూర్తి చేసుకుంది. సముద్రం నేపథ్యంలో కొన్ని కీలక ఘట్టాలను తెరకెక్కించారు. తాజా సమాచారం ప్రకారం తదుపరి షెడ్యూల్‌ను శ్రీలంకలో జరుపబోతున్నారని తెలిసింది. దాదాపు మూడు వారాల పాటు జరిగే ఈ షెడ్యూల్‌లో ప్రధాన తారాగణం మొత్తం పాల్గొంటారని చెబుతున్నారు. ఈ సినిమాతో పాటు ప్రస్తుతం విజయ్ దేవరకొండ రెండు పాన్ ఇండియా ప్రాజెక్ట్స్‌తో బిజీగా ఉన్నారు. అందులో ఓ చిత్రాన్ని దిల్‌రాజు నిర్మిస్తున్నారు. రవికిరణ్ కోలా దర్శకుడు. గ్రామీణ నేపథ్య యాక్షన్ కథాంశమిది. మరో చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ తెరకెక్కిస్తుండగా రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వం వహిస్తున్నారు. 1854-1978 మధ్య జరిగిన చారిత్రక యథార్థ ఘటనల ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు.

హారర్ మిస్టరీ స్టోరీ

బెల్లంకొండ సాయిశ్రీనివాస్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం సోమవారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. కౌశిక్ పెగళ్లపాటి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని ఫైన్ స్క్రీన్స్ పతాకంపై సాహు గారపాటి నిర్మిస్తున్నారు. అనుపమ పరమేశ్వరన్ కథానాయిక. ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత నవీన్ యెర్నేని క్లాప్‌నివ్వగా, దిల్ రాజు కెమెరా స్విచాన్ చేశారు. దర్శకుడు చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'హారర్ మిస్టరీ కథాంశమిది. సరికొత్త బ్యాప్‌డ్రాప్‌తో ఆకట్టుకుంటుంది. ఇప్పటికే విడుదల చేసిన ఫస్ట్‌లుక్ సినిమాపై ఆసక్తిని పెంచింది. సీట్‌ఎడ్జ్ థ్రిల్లర్‌గా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతినందించే చిత్రమవుతుంది' అన్నారు. ఈ నెల 11 నుంచి రెగ్యులర్ షూటింగ్‌ను మొదలుపెడతామని నిర్మాత సాహు గారపాటి తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: చిన్మయ్ సలాస్కర్, సంగీతం: బి.అజనీష్ లోక్‌నాథ్, ఆర్ట్: శివ కామేష్, ప్రొడక్షన్ డిజైన్: మనీషా ఏ దత్, రచన-దర్శకత్వం: సాహు గారపాటి.

హంపిలో మొదలైన 'ది ఇండియా హౌస్'

అగ్ర హీరో రామ్‌చరణ్ సమర్పకుడిగా వ్యవహరిస్తున్న 'ది ఇండియా హౌస్' కర్ణాటకలోని హంపిలో ఘనంగా ప్రారంభమైంది. వీ మెగా పిక్చర్స్, అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్ పతాకాలపై విక్రమ్ రెడ్డి, అభిషేక్ అగర్వాల్ నిర్మిస్తున్నారు. రామ్‌వంశీ కృష్ణ దర్శకత్వం వహిస్తున్నారు. హంపిలోని విరూపాక్ష దేవాలయంలో పూజా కార్యక్రమాలతో ఈ సినిమాను ప్రారంభించారు. నేటి నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలవుందని, 1905 బ్యాక్‌డ్రాప్‌లో లవ్, రెవల్యూషనరీ కథాంశంతో ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నామని, పీరియాడిక్ డ్రామాగా ప్రేక్షకులను మెప్పిస్తుందని దర్శకుడు తెలిపారు. ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో వెల్లడికానున్నాయి. ఈ చిత్రానికి కెమెరా: కామెరాన్ బైసన్, ప్రొడక్షన్ డిజైనర్: రజిని, సహనిర్మాత: మయాంక్, రచన-దర్శకత్వం: రామ్ వంశీకృష్ణ.

హుషారెత్తించే స్టెప్పామార్...



రామ్ పోతినేని, పూరి జగన్నాథ్ కాంబినేషన్‌లో వచ్చిన 'ఇస్మార్ట్ శంకర్' మాస్ ఎంటర్‌టైనర్‌గా ప్రేక్షకుల్ని మెప్పించింది. ఇప్పుడీ చిత్రానికి సీక్వెల్‌గా 'డబుల్ ఇస్మార్ట్' తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. ఆగస్ట్ 15న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో తొలి సింగిల్ 'స్టెప్పామార్'తో ప్రచారపర్వాన్ని మొదలుపెట్టారు. మణిశర్మ కంపోజ్ చేసిన ఈ గీతాన్ని భాస్కర భట్ల రచించారు. అనురాగ్ కులకర్ణి, సాహితి ఆలపించారు. హుషారైన బీట్‌తో పర్‌ఫెక్ట్ మాస్ నంబర్‌గా తెరకెక్కించిన ఈ గీతంలో హీరో రామ్ డ్యాన్స్ హైలైట్‌గా నిలిచింది. విజువల్స్ ఆకట్టుకునేలా ఉన్నాయి. పూరి జగన్నాథ్ తనదైన శైలి మాస్, యాక్షన్ అంశాలతో రూపొందిస్తున్న ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను మెప్పిస్తుందని చిత్రబృందం పేర్కొంది. సంజయ్‌దత్, కావ్యథాపర్, అలీ, గెటప్ శ్రీను తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: శ్యామ్ కే నాయుడు, జియాని జియాన్నెలి, సంగీతం: మణిశర్మ, నిర్మాతలు: పూరి జగన్నాథ్, ఛార్మికౌర్, రచన-దర్శకత్వం: పూరి జగన్నాథ్.

క్రైమ్ కథాంశంతో 'కోడిబుర్ర'

హీరో రామ్ కొత్త చిత్రం 'కోడిబుర్ర' సోమవారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. చంద్రశేఖర్ కానూరి దర్శకుడు. వీ4 క్రియేషన్స్ సంస్థ నిర్మిస్తున్నది. శృతిమీనన్ కథానాయిక. ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత బెక్కెం వేణుగోపాల్ క్లాప్‌నివ్వగా, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి కెమెరా స్విచాన్ చేశారు. క్రైమ్ థ్రిల్లర్ కథాంశమిదని దర్శకుడు తెలిపారు. ఈ సినిమాలో తాను పోలీసాఫీసర్‌గా నటిస్తున్నానని, ఆద్యంతం ఉత్కంఠభరితమైన మలుపులతో కథ సాగుతుందని హీరో శ్రీరామ్ అన్నారు. ఈ నెల 22 నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలుపెడతామని నిర్మాతలు తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: శ్రీకాంత్ కొండా, సంగీతం: సుకుమార్ రాగ, నిర్మాతలు: కంచర్ల సత్యనారాయణ రెడ్డి, గట్టు విజయ్ గౌడ్, చిన్ని చందు, వట్టం రాఘవేంద్ర, సముద్రాల మహేష్ గౌడ్, రచన-దర్శకత్వం: చంద్రశేఖర్ కానూరి.

సుధీర్‌బాబు సూపర్ నేచురల్ థ్రిల్లర్

యువహీరో సుధీర్‌బాబు సినిమా అంటే కథలో ఏదో కొత్తదనం ఉండాల్సిందే. కమర్షియల్ విజయాలతో సంబంధం లేకుండా వినూత్నమైన కథలకు ప్రాధాన్యతనిస్తూ కెరీర్‌ను తీర్చిదిద్దుకుంటున్నారు. తాజాగా ఆయన పాన్ ఇండియా సూపర్ నేచురల్ మిస్టరీ థ్రిల్లర్ కథాంశంతో ఓ సినిమా చేయబోతున్నారు. ఈ చిత్రం ద్వారా వెంకట్ కల్యాణ్ దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. సుధీర్‌బాబు చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'మన పురాణాలతో సంబంధం కలిగిన ఎన్నో రహస్యాలను వెలికితీసే కథాంశమిది. యూనివర్సల్ కాన్సెప్ట్‌తో ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని కలిగిస్తుంది. కుట్ర, పన్నాగాలతో కూడిన చెడుకి, నీతి, న్యాయం మూర్తీభవించిన మంచికి నడుమ జరిగే యుద్ధంగా తెరకెక్కించబోతున్నాం. నా కెరీర్‌లో మైలురాయిగా నిలుస్తుందనే నమ్మకం ఉంది' అన్నారు. ఆగస్ట్ 15న ఫస్ట్‌లుక్ విడుదల చేస్తామని నిర్మాతలు ప్రేరణ అరోరా, శివిన్ నారంగ్, నిఖిల్ నంద, ఉజ్వల్ ఆనంద్ తెలిపారు. ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలను త్వరలో తెలియజేస్తారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.